## • వరద పర్యటనలోనూ రాజకీయ రంగు







1 ఖమ్మం పర్యటనలో భాగంగా ఎఫ్‌సీఐ రోడ్డులో ఓపెన్‌టాప్ వాహనంలో ఊరేగింపుగా వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. కాంగ్రెస్ పార్టీ ప్రచార రథానికి తెల్ల వస్త్రం కట్టడం చర్చనీయాంశంగా మారింది.

2 ఖమ్మంలోని మున్నేరు వాగును కాంగ్రెస్ కండువా వేసుకొని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

3 సూర్యాపేట జిల్లా మోతెలో పూలతో అలంకరించిన స్టేజీపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి

# కన్నీరు.. మున్నేరు!

- ఖమ్మంలో మున్నేరు ముంపుప్రాంత ప్రజల విలవిల
- అర్ధరాత్రి వరద నీటితో కట్టుబట్టలతో పరుగులు
- తాగడానికి నీళ్లు..తినడానికి ఆహారం లేక పస్తులు
- బురదతో నిండిన ఇండ్లను చూసి కన్నీళ్లు
- ప్రభుత్వం నుంచి అందని సహాయ సహకారాలు



ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు ప్రాంతంలో ఆరుబయట చీరతో ఊయల కట్టి చంటిపాపను ఊపుతున్న తల్లి జ్యోతి

ఖమ్మం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/తిరుమలాయపాలెం : ఖమ్మం జిల్లాలో 20 ఏండ్లలో ఎన్నడూ పడనంతగా భారీ వర్షం పడింది. ఖమ్మం జిల్లా చరిత్రలోనే రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైంది. కూసుమంచి మండలంలో అత్యధికంగా 31.5 సెం.మీ., మధిర 28.38 సెం.మీ, తిరుమలాయపాలెం 26.3 సెం.మీ, చింతకాని 26.22 సెం.మీ, వైరా 24.76 సెం.మీ, ఎర్రుపాలెం 24.76 సెం.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికితోడు ఎగువ నుంచి వచ్చే వరదతో మున్నేరు వాగు ఉగ్రరూపం దాల్చి జలప్రళయం సృష్టించింది. పాలకుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో మున్నేరు నది పరీవాహక ప్రాంతాలైన బొక్కలగడ్డ, వెంకటేశ్వర నగర్, మాణిక్యనగర్, గణేశ్‌నగర్, మోతీనగర్, మంచికంటినగర్, దానవాయిగూడెం కాలనీ, ధంసలాపురం కాలనీలోని బడుగు జీవులు బజారున పడ్డారు. శనివారం రాత్రి ఒక్కసారిగా వచ్చిన భారీ వరదతో ఖమ్మం నగరంలో ప్రజలు కట్టుబట్టలతో ఇల్లు వదిలారు. బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి తలదాచుకున్నారు. ప్రభుత్వ పునరావాస కేంద్రాల్లో కొందరే ఉన్నారు. 24 గంటలు గడిచినా పాలకులు, జిల్లా యంత్రాంగం వారికి తినడానికి తిండి, తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా అందించలేదు. అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు ముంపు బాధితులను ఆదుకున్నాయి.

### లక్షల్లో ఆస్తి నష్టం..

మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో బురదతో నిండిన ఇంటిని, నీటిలో మునిగిన వస్తువులు, వాహనాలను చూసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రతి ఇంటికి కనీసం రూ.2లక్షల ఆస్తినష్టం జరిగింది. పస్తులతోనే ఇంటిని శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయితే నిరుడు కూడా మున్నేరు 32 అడుగుల మేర ప్రవహించింది. అయితే అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం వల్లనే భారీ ఆస్తి నష్టం జరిగింది. దీంతో తమ ప్రాంతాలకు వస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

### ఆకేరు ఆగ్రహం.. అపార నష్టం

ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండలంలో ప్రవహించే ఆకేరు వాగు ఉధృతికి అన్నదాతలు కన్నీటిసంద్రంలో మునిగిపోయారు. హైదర్‌సాయిపేట-ధర్మారం బ్రిడ్జి పూర్తిగా కొట్టుకుపోయింది. అజ్మీరాతండా, తిప్పారెడ్డిగూడెం, తిరుమలాయపాలెం సమీపంలోని ఆకేరు బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. 1,770 ఎకరాల్లో వరి, 1,470 ఎకరాల్లో పత్తి, 505 ఎకరాల్లో మిరప పంటలకు నష్టం జరిగినట్టు మండల వ్యవసాయాధికారి సీతారామ రెడ్డి తెలిపారు. ఆకేరు ప్రవాహంతో రాకాశి తండా నీటమునిగింది. గ్రామంలో రెండు ఇళ్లు కొట్టుకుపోగా, మరో 10 ఇళ్లు దెబ్బతిన్నాయి. గ్రామంలో పర్యటించిన అధికారులు ఐకేపీ ద్వారా భోజనాలు అందించి చేతులు దులుపుకున్నారు. వైద్యసిబ్బంది శిబిరాన్ని ఏర్పాటు చేశారు.మంత్రులెవ్వరూ రాకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### కేసీఆర్ మా దేవుడు

పోయిన ఏడాది వరదలు వచ్చినప్పుడు సీఎం కేసీఆర్ సీఎంగా ఉన్నారు. ఆయనే మా దేవుడు. ఆయన వెంటనే పువ్వాడ అజయ్‌కుమార్‌ను పంపి మాకు అండగా ఉంచారు. ఎలాంటి ప్రాణ నష్టం కాదు కదా.. కనీసం ఆస్తి నష్టం జరగలేదు. నిరుడు వరదలు వస్తాయని ముందే చెప్పడంతో మా సరుకులు, వస్తువులను ట్రాక్టర్లలో తీసుకెళ్లి నయాబజార్ కళాశాలలో ఉంచాం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. వరదలు వస్తాయని ఏ ఒక్కరూ చెప్పలేదు. మాకు జరిగిన నష్టాన్ని ఎవరు భరిస్తారు?

- నాళం విజయలక్ష్మి, ఖమ్మం

### మమ్ముల్ని కాపాడేది ఎవరు?

ఖమ్మం ఎమ్మెల్యేగా అజయ్‌కుమార్ ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు. నిరుడు వరదలు వస్తే మా తోటే ఉండి మాతోటే తిన్నాడు. నాయకుడు అంటే అలా ఉండాలి. ఇప్పుడు మమ్ముల్ని పట్టించుకునేవాడే లేడు. రాత్రిపూట వరద వస్తుందని చెప్పినట్లయితే మా ఆస్తులను పోగొట్టుకునే వాళ్లం కాదు. అధికారులు, నాయకులు నష్టం జరిగాక వచ్చి ఫొటోలకు ఫోజులు ఇవ్వడం వల్ల ఏ ఉపయోగం ఉండదు. ఇప్పుడు మమ్ముల్ని కాపాడేది ఎవరు.

- జ్యోతి, చంటి పాప తల్లి, ఖమ్మం



ఖమ్మంలో వరదలో కొట్టుకుపోయిన బైక్



ఖమ్మం కాల్వొడ్డులో ఇంట్లో తడిసిన పుస్తకాలను తీసి ఆరుబయట చదువుకుంటున్న చిన్నారులు



ఖమ్మం కాల్వొడ్డులో ఓ ఇంట్లోని సామగ్రి బయట వేసి శుభ్రం చేసుకుంటున్న కుటుంబ సభ్యులు



ఖమ్మం కాల్వొడ్డులోని కాలనీలో వరదతో తడిసి ముద్దయిన సామగ్రిని ఇంటి ముందు పెట్టిన కుటుంబ సభ్యులు

## 'సీతారామ' కాలువకు గండి

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/పుల్కల్: రైతులకు నీరందించే సీతారామ కాలువకు గండి పడింది. సీతారామ కాలువను ఇటీవలె సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ములకలపల్లి మండలం కమలాపురం పంప్‌హౌస్ వద్ద కాలువకు భారీగా నీరు చేరడంతో ముందుగానే అధికారులు గండికొట్టే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. వరద ఉధృతికి కాలువ కోతకు గురికావడంతో ఒక్కసారిగా పక్కనే ఉన్న పంట పొలాలకు కాలువలో నీరు ప్రవహించాయి. సుమారు 50 ఎకరాల పంట నష్టం జరిగింది. అలాగే సంగారెడ్డి జిల్లాలో సింగూరు ప్రాజెక్టు కాలువ తెగిపోయింది. ఏకధాటిగా వర్షాలకు ఇసోజిపేట శివారులోని సింగూరు కెనాల్ కాలువలోకి వరద భారీగా వచ్చి తెగింది. గడిచిన మూడేండ్లలో ఈ కాలువ ఐదుసార్లు తెగింది.

## కృష్ణమ్మ ఉగ్రరూపం.. ఉప్పొంగిన గోదావరి

హైదరాబాద్, సెప్టెంబర్2 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం ప్రాజెక్టుకు 4.86 లక్షలు, నాగార్జునసాగర్‌కు 5.46 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. ప్రకాశం బరాజ్ వద్ద రికార్డు స్థాయిలో వరద ప్రవాహం నమోదయింది. 2009లో రికార్డు స్థాయి ప్రవాహం 10లక్షల క్యూసెక్కులుండగా తాజాగా ఆదివారం రాత్రి 10.10 లక్షల క్యూసెక్కులు నమోదయింది. ప్రకాశం బరాజ్ 70 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో శ్రీరాంసాగర్ 10 గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. ఎల్లంపల్లికి 2.92 లక్షల ప్రవాహం కొనసాగుతున్నది. మున్నేరు, ఆకే రు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 275చెరువులు, కాలువలకు గండ్లుపడగా, రూ.700కోట్ల మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు ఇరిగేషన్‌శాఖ అధికారులు నిర్ధారించారు. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 62చెరువులు, ములుగు జిల్లాలో 42, ఖమ్మం జిల్లాలో 38, సూర్యాపేట జిల్లాలో 32 చెరువులు, కాలువలు గండిపడినట్లు తెలిపారు. 275 గండ్లలో దాదాపు 150 మేరకు చోట్ల తక్షణ మరమ్మతులు చేట్టినట్లు వివరించారు.



ఖమ్మం నగరంలోని కాల్వొడ్డులో నిరసన వ్యక్తం చేస్తున్న యువతను అదుపు చేస్తున్న పోలీసులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మల్లెలమడుగు వద్ద కొట్టుకుపోయిన ప్రధాన రహదారి



మహబూబాబాద్‌లో రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు

## యుద్ధప్రాతిపదికన రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

- వంద మంది కార్మికులు, ఐదు యంత్రాలతో మరమ్మతులు
- 10 చోట్ల కొట్టుకుపోయిన రోడ్లు.. మరో 10 చోట్ల రహదారికోత
- మరమ్మతుకు రూ. 2 కోట్లు అవసరమన్న అధికారులు
- మహబూబాబాద్ జిల్లాలో 28,217 ఎకరాల్లో మునిగిన పంటలు



మహబూబాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/కేసముద్రం : భారీ వర్షాల కారణంగా మహబూబాబాద్ జిల్లాలో దెబ్బతిన్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. వరద ప్రవాహం అధికంగా రావడంతో జిల్లాలోని కేసముద్రం - ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య 418 కిలో మీటర్ రాయి వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతిన్నది. దీంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం డీఆర్ఎం అరుణ్‌కుమార్ జైన్ పర్యవేక్షణలో రైల్వే అధికారులు సుమారు వంద మంది కార్మికులు, ఐదు యంత్రాలతో మర్మమతు పనులు చేపట్టారు. ఐదు ప్రాంతాలలో డ్యామేజీని గుర్తించి 4 ప్రాంతాల్లో పనులు పూర్తి చేసినట్టు డీఆర్ఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు పునరుద్ధరణ పనులు పూర్తికావాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 10 చోట్ల రోడ్లు కొట్టుకుపోగా, మరో 10 చోట్ల రోడ్డు కోతకు గురైనట్టు ఆర్అండ్‌బీ అధికారులు గుర్తించారు. వీటి మరమ్మతుకు రూ. 2 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. వర్షాల కారణంగా జిల్లాలో 16,810 ఎకరాల్లో వరి, 5,764 ఎకరాల్లో పత్తి, 2,796 ఎకరాలో మక్కజొన్న, ఇతర పంటలు 2,172 ఎకరాలు, మొత్తం 27,542 ఎకరాల్లో పంటలు నీటి మునిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. 675 ఎకరాలల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. మంత్రి సీతక్కతో పాటు అధికారులు పర్యటించినప్పటికీ ఎలాంటి భరోసా ఇవ్వకపోవడంతో ప్రజలు నిరాశ చెందారు.



మహబూబాబాద్‌లో నేలకొరిగిన విద్యుత్తు స్తంభం

## ఖమ్మం జిల్లాకు 10 మెడికల్ క్యాంపులు

- రాష్ట్రవ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాల్లోనూ ఏర్పాటు
- వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.అవసరమైన వారికి టెస్టులు చేసి, మెడిసిన్ అందజేయాలని సూచించారు. ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణి, వైద్యవిధాన పరిషత్తు కమిషనర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్‌తో మంత్రి సోమవారం సాయంత్రం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.వరదతీవ్రత ఎక్కువగా ఉన్న ఖమ్మం జిల్లాలో 10 మెడికల్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి టీమ్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లు, సిబ్బంది, టెస్టులు చేయడానికి అవసరమైన పరికరాలు, మెడిసిన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ బాధ్యతలను హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్‌కు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

### వరద నష్టం 5,438 కోట్లు!

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు, వరదల ఫలితంగా దాదాపు రూ.5,438 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. 110 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసి 4,000 మందికి పైగా ప్రజలను సురక్షితంగా శిబిరాలకు తరలించినట్టు వెల్లడించింది. రోడ్లు, భవనాలశాఖకు రూ.2,362 కోట్లు, ఇంధనశాఖ (ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్‌కు నష్టం) రూ.175 కోట్లు, పంట నష్టం 4,15,000 ఎకరాల్లో రూ.415 కోట్లుగా, నీటిపారుదల (మైనర్ ట్యాంకుల మరమ్మతులు) రూ.629 కోట్లుగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.170 కోట్లుగా, వైద్యారోగ్యశాఖకు రూ.12 కోట్లుగా, పశు సంవర్ధక శాఖ రూ.25 కోట్లుగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ రూ.1,150 కోట్లు, ఇతర విభాగాల్లో రూ.500 కోట్ల ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లినట్టు తెలిపింది.



మహబూబాబాద్‌లో ఇల్లు కూలడంతో నిరాశ్రయులైన ఓ కుటుంబం